ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 228 | పేజీలు: 4 | వెల: రూ.3/- | సోమవారం 25 నవంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్



### రాష్ట్రంలో భారీగా పడిపోతున్న

## ఉష్ణోగ్రతలు!

**హైదరాబాద్, నవంబర్ 24 (ప్రభాత ఉదయం):** తెలంగాణ వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హైదరాబాద్ పేర్కొంది. పలు జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 11 డిగ్రీల సెల్సియస్‌కు చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. ఉష్ణోగ్రతల తగ్గుదల బుధవారం వరకు కొనసాగుతుందని తెలిపింది. రాష్ట్రంలోని అనేక ప్రాంతాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కుమురం భీమ్, మంచిర్యాల, మెదక్, నిర్మల్, సంగారెడ్డి, వరంగల్ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ లో కూడా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. నగర శివారుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఉదయం వేళల్లో పొగమంచు ..మిగతా 2లో

# ఈ రోజు ఎంతో ప్రత్యేకం

## ఎన్‌సీసీలో తన అనుభవాలను గుర్తుచేసుకున్న మోదీ

**న్యూఢిల్లీ, నవంబర్ 24 (ప్రభాత ఉదయం):** నేడు ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోదీ తన అనుభవాలను పంచుకున్నారు. దిల్లీ: యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, సేవాతత్వాన్ని పెంపొందించడంలో ఎన్‌సీసీ ప్రముఖ పాత్ర వహిస్తుందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఆదివారం ప్రసారమైన 116వ 'మన్ కీ బాత్'ఎపిసోడ్‌లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్‌సీసీ డే సందర్భంగా మాట్లాడిన ఆయన.. తాను క్యాడెట్‌గా ఉన్న సమయంలోని అనుభవాలను గుర్తు చేసుకున్నారు. "ఈ రోజు ఎన్‌సీసీ దినోత్సవం. ఇది ఎంతో ప్రత్యేకమైన రోజు. ఎన్‌సీసీ పేరు వినగానే మనందరికీ మన కాలేజీ, అలనాటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తుంటాయి. నేను కూడా ఎన్‌సీసీ క్యాడెట్‌నే. ఆ సమయంలో నేను పొందిన అనుభవం నాకెంతో అమూల్యమైంది. పూర్తి విశ్వాసంతో ఈ మాట మీకు చెబుతున్నాను. యువతలో క్రమశిక్షణ, సేవా గుణాన్ని, నాయకత్వ లక్షణాలను మరింత పెంపొందించడంలో దీని పాత్ర కీలకం" అని ప్రధాని వ్యాఖ్యానించారు. గయానాలో తన పర్యటన గురించి మోదీ ప్రస్తావించారు. "భారత్‌కు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న గయానాలో ఒక మినీ భారత్ ఉంది. కూలీ పనుల కోసం 180 ఏళ్ల క్రితం ఎంతోమంది భారతీయులను అక్కడికి ..మిగతా 2లో



### ప్రభుత్వ ఏర్పాటుకు

## 'మహా'యుతి సిద్ధం

### సీఎం అభ్యర్థిపై వీడని ఉత్కంఠ!



**ముంబై, నవంబర్ 24 (ప్రభాత ఉదయం):** మహారాష్ట్రలో తిరుగులేని విజయం సాధించిన బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమైంది. సోమవారమే ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగే అవకాశముందని శిందే వర్గం శివసేన నేత దీపక్ కేసర్కార్ వెల్లడించారు. సీఎంతో పాటు ఆయన డిప్యూటీలు ప్రమాణ స్వీకారం చేసే అవకాశముందని తెలిపారు. అయితే, బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడణవీస్, ఏక్‌నాథ్ శిందే ..మిగతా 2లో

## అదానీ లంచాల వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చించాలి

### అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ డిమాండ్

**న్యూఢిల్లీ, నవంబర్ 24 (ప్రభాత ఉదయం):** పార్లమెంట్ శీతాకాల సమావేశం సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం ఆదివారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. సమావేశాలు సజావుగా సాగేందుకు సహకరించాలని కేంద్రం విజ్ఞప్తి చేసింది. అయితే, అదానీ గ్రూప్‌పై లంచం ఆరోపణలపై చర్చించాలని అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్ డిమాడ్ చేసింది. శీతాకాల సమావేశాల్లో విపక్షాలు ఈ అంశంపై చర్చకు పట్టుపట్టే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో సమావేశాలు స్తంభించే అవకాశం ఉండగా.. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీకి కొత్త ఊరటనిచ్చాయి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, శివసేన, బీజేడీ తదితర పార్టీల ..మిగతా 2లో





### ప్రభుత్వ వైఫల్యాలను

## ప్రజలకు వివరిద్దాం

### బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, నవంబర్ 24 (ప్రభాత ఉదయం):** భారత దేశ చరిత్రలోనే అధికారంలోకి వచ్చిన పది నెలల్లోనే ఇంత ప్రజా వ్యతిరేకత మూట గట్టుకున్న ప్రభుత్వం ఎక్కడా లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేయకుండా పార్టీ మారిన వ్యక్తులను ప్రజలు క్షమించరని స్పష్టం చేశారు. ఆదివారం బంజారాహిల్స్ లోని తన నివాసంలో జగిత్యాల నియోజకవర్గ నాయకులతో ఆమె సమావేశమయ్యారు. సోమవారం ఉదయం 11 గంటలకు కులగణన కమిషన్‌కు నివేదిక అందజేయనున్నారు. ఈ నేపథ్యంలో, బీసీ సంఘాల నాయకులతోనూ ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. జగిత్యాలకు, నాకు ఆత్మయ అనుబంధం ఉందని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. 2014 లో నిజామాబాద్ ఎంపీగా తాను గెలిచినా, జగిత్యాల ఎమ్మెల్యేగా సంజయ్ కుమార్ ఓడిపోయారని, కానీ పార్టీలకతీతంగా, వచ్చిన తెలంగాణను అభివృద్ధి చేసుకువాలని, కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నా, అభివృద్ధిలో జగిత్యాల వెనకబడొద్దనే ఆదేశాలను కేసీఆర్ ఇచ్చారని ఎమ్మెల్సీ కవిత గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడగానే చిన్న జిల్లాలు ఏర్పాటు చేసుకోవాలి. చిన్న జిల్లాల ద్వారానే ఎక్కువ ..మిగతా 2లో

## చివరి దశకు సమగ్ర కుటుంబ సర్వే

### డేటా ఎంట్రీనే కీలకం



**హైదరాబాద్, నవంబర్ 24 (ప్రభాత ఉదయం):** సమగ్ర కుటుంబ సర్వే చివరి దశకు చేరుకుంటుంది. డేటా ఎంట్రీ దశ చాలా ముఖ్యమై నది. ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకండి' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇవాళ ఉదయం ఆయన జార్ఖండ్ రాజధాని రాంచీ నుంచి సమగ్ర కుటుంబ సర్వే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లుకు పలు సూచనలు చేశారు. సర్వేదశలో పట్టణ ప్రాంతాల్లో డోర్ లాక్, ఇంటి వద్ద అందుబాటులో లేకపో వడం వంటి కొన్ని సమస్యలు తలెత్తాయన్నారు. కాబట్టి వారికి ఫోన్ కాల్ చేసి సర్వే గురించి తెలియజేయడం ద్వారా ఆ వివరాలను క్రమబద్ధీకరించుకోవాలని, వారిని అందు బాటులో ఉండమని కోరాలని ఆదేశించారు. కొన్ని వసతి గృహాల్లో, రెసిడెన్షియల్ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కేసులు నమోదవుతున్నాయన్నారు. ఈ ..మిగతా 2లో

### అనుమతులు లేకుండా

## అక్రమ నిర్మాణాలు

### నటుడు అలీకి నోటీసులు



**హైదరాబాద్, నవంబర్ 24 (ప్రభాత ఉదయం):** టాలీవుడ్ యాక్టర్ అలీకి వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట మండలం ఎక్‌మామిడి పరిధిలో వ్యవసాయ భూమి ఉంది. ఆయన ఫ్యామిలీతో కలిసి తరుచుగా అక్కడకు వెళ్తుంటారు. అక్కడ తాజాగా పర్మిషన్ లేకుండా ఫామ్ హౌస్ నిర్మాణాలు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు అందాయి. దీంతో అలీకి గ్రామ కార్యదర్శి శోభారాణి ..మిగతా 2లో

# 29న జిల్లా కేంద్రాల్లో దీక్షా దివస్: కేటీఆర్

**హైదరాబాద్, నవంబర్ 24 (ప్రభాత ఉదయం):** కాంగ్రెస్ కబంధహస్తాల నుండి నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను కాపాడుకోవాలని మరో సంకల్ప దీక్ష చేపట్టాల్సిన తరుణం ఆసన్నమైంది అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామరక్ష అని ప్రొఫెసర్ జయశంకర్ చెప్పిన మాటలను కేటీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ చరిత్రలో ఉద్యమనేత, మాజీ సీఎం కేసీఆర్‌ది చెరగని ముద్ర అని అన్నారు. . 2009 నవంబర్ 29వ తేదీ.. కేసీఆర్ దీక్షతో తెలంగాణ ఉద్యమం మలుపు తిరిగిందన్నారు. కేసీఆర్ దీక్ష తెలంగాణపై చెరగని ముద్ర వేసిందని గుర్తు చేశారు. నవంబర్ 29వ తేదీన 33 జిల్లా కేంద్రాల్లో దీక్షా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా..తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా ఏప్రిల్ 27, 2001 నాడు గులాబీ జెండాను ఎగరవేసిన నాయకులు కేసీఆర్ అని కేటీఆర్ చెప్పారు. తెలంగాణ మలి దశ ఉద్యమాన్ని మలుపు తిప్పి.. 60 ఏళ్ల తెలంగాణ ఉద్యమ చరిత్ర పై కేసీఆర్ చెరిగిపోని సంతకం చేసిన మహానాయకుడు అని కొనియాడారు. మహోజ్వల ఉద్యమానికి మలుపు తిప్పిన రోజు2009, నవంబర్ 29న కేసీఆర్ నిరాహార దీక్ష మహోజ్వల ఉద్యమాన్ని మలుపుతిప్పిన రోజు అని కేటీఆర్ చెప్పారు. నవంబర్ 29, 2009 స్వరాష్ట్ర కల సాకారానికి పునాది వేసిన రోజుగా తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే శుభదినమన్నారు. మూడు కోట్ల తెంగాణ ప్రజలు ముక్త కంఠంతో మా




తెలంగాణ మాకు కావాలని నినదించారు. కేసీఆర్ సచ్చుడో తెలంగాణ తెచ్చుడో అని తెగువను ప్రదర్శించిన నాయకుడికి అండగా నిలబడ్డారు. అందర్నీ మెప్పించి ఒప్పించి, దేశ రాజకీయ వ్యవస్థను, రాష్ట్రంలో ఉండే రాజకీయ వ్యవస్థను కులమతాలకు అతీతంగా కలిపింది దీక్షా దివస్ అని కేటీఆర్ గుర్తు చేశారు.

**ఘనంగా దీక్షా దివస్**

ఈ నెల 29న 33 జిల్లా పార్టీ కార్యాలయాల్లో పెద్ద ఎత్తున దీక్షా దివస్ నిర్వహించనున్నట్లు కేటీఆర్ తెలిపారు. కేసీఆర్ నాయకత్వం.. ఉద్యమంలో కానీ, పరిపాలనలో కానీ చెరగని ముద్ర వేసిందన్నారు. రెండు జాతీయ పార్టీలకు బుద్ధి చెప్పే విధంగా కదం తొక్కుతామన్నారు. 29న దీక్షా దివస్‌తో పార్టీ శ్రేణులు కదం తొక్కాలని విజ్ఞప్తి చేశారు. అన్ని జిల్లాలకు సీనియర్ నాయకులను ఇంచార్జిలుగా నియమించామని, ఈ నెల 26న ప్రతి జిల్లాలో ముఖ్య నాయకులు కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తారని తెలిపారు. డిసెంబర్ 9న మేడ్చల్ తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణతో దీక్షా దివస్ ముగిస్తామని తెలిపారు. తెలంగాణ తల్లికి ప్రణమిల్లుతూ ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు అందరూ పాల్గొంటారని కేటీఆర్ తెలిపారు.

**29న నిమ్స్ హాస్పిటల్‌లో అన్నదానం**

ఈ నెల 29న దీక్షా దివస్ కార్యక్రమాన్ని తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తామని, ఇందులో భాగంగా నిమ్స్ హాస్పిటల్ లో అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు కేటీఆర్ తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో నిమ్స్ హాస్పిటల్ పాత్ర కూడా ఎంతో ఘనమైందని, నాడు కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్‌కు తరలించడంతో అక్కడ కదన రంగంగా మారిపోయిందని గుర్తు చేశారు. మలిదశ ఉద్యమానికి కేంద్ర బిందువుగా మారిన నిమ్స్ హాస్పిటల్‌లో అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తామని కేటీఆర్ తెలిపారు.

**కాంగ్రెస్ కబంధ హస్తాల నుంచి కాపాడుకుందాం**

సమైక్య రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ పాలనలో ప్రతి వర్గం, ప్రతి మనిషి బతుకు చిధ్రమైన పరిస్థితి ఏర్పడిందని, మళ్లీ ఇవాళ ఆ పరిస్థితితులు తిరిగి కనబడుతున్నాయని అన్నారు. అదే నిర్బంధం, అదే అణిచివేత, అవే దుర్భర పరిస్థితులు, ఆందోళనకరమైన పరిస్థితి కనబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ సాధించిన కేసీఆర్ స్ఫూర్తితో నేడు మళ్లీ రెండు ఢిల్లీ పార్టీ మెడలు వంచాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే తిరిగి తెలంగాణలో బతుకు అంధకారమైందని అన్నారు.

# అబద్ధాలు చెప్పడంలో సీఎం రేవంత్‌కు పీహెచ్డీ ఇవ్వాలి: హరీష్ రావు



**కరీంనగర్, నవంబర్ 24 (ప్రభాత ఉదయం):** ఆరు గ్యారంటీల మోసాన్ని గ్రహించి మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను ఓడించారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు, సీఎం రేవంత్ రెడ్డి కళ్ళు తెరిచి బుద్ధి తెచ్చుకోవాలని, వందరోజుల్లో అమలు చేస్తామన్న 6 గ్యారంటీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాండ్ పేపర్ మీద రాసిచ్చి, దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి ప్రజలను మోసం చేశారని.. అబద్ధాలు చెప్పడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పీహెచ్డీ ఇవ్వాలని సెటైర్ వేశారు. 2024, నవంబర్ 24న కరీంనగర్‌లోని హుజురాబాద్‌లో హరీష్ రావు మీడియాతో మాట్లాడారు. హుజురాబాద్‌లో 18500 మందికి కేసీఆర్ దళిత బంధు మంజూరు చేశారని.. వీరిలో కొందరికి ఆగిపోయిన ఐదు లక్షలు ఇవ్వమంటే వారిపై పోలీసులతో దాడి చేసి లాఠీ చార్జ్ చేయించారని ఫైర్ అయ్యారు. ఉప ముఖ్యమంత్రి భట్టి దళితులకు చేసే మేలు ఇదేనా అని ప్రశ్నించారు. ఇప్పటికే విడుదలైన దళిత బంధు డబ్బులను వాళ్లకు అందించాలని డిమాండ్ చేశారు. 2024, జులై 19న లగచర్లలో ఫార్మాసిటీ అంటూ ప్రభుత్వం గెజిట్ ఇచ్చింది.. కానీ లగచర్లలో ఫార్మాసిటీ కాదు ఇండస్ట్రియల్ కారిడార్ అంటూ ఇప్పుడు సీఎం మాట మార్చాడు.. ఇప్పుడు నీవు ఇచ్చిన గెజిట్‌పైనే అబద్ధాలు ఆడుతున్నావని విమర్శించారు. ప్రజలకు క్షమాపణ చెప్పి ఆ గెజిట్ వెనక్కి తీసుకున్నట్టు రేవంత్ రెడ్డి ప్రకటించాలని.. ఆ జీవో రద్దు చేసి కొత్త గెజిట్ ఇస్తేనే ప్రజలు నమ్ముతారని అన్నారు.ల గచర్లలో పచ్చని పంటలు పండే భూములను తొండలు గుడ్డు పెట్టని భూములుగా రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కూలిపోయిందని చెబుతున్న ప్రభుత్వం.. 20 టీఎంసీల నీటిని అదే ప్రాజెక్టు నుంచి హైదరాబాద్‌కు ఎలా తీసుకోస్తోందని నిలదీశారు. మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగం కాదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని 39 కాంపోనెంట్లలో మేడిగడ్డ అనేది ఒక కాంపోనెంట్ మాత్రమేనని.. అందులో రెండు పిల్లర్లకు మాత్రమే డామేజ్ జరిగిందని.. కానీ దీన్ని కొండంత చేసి గోబెల్ ప్రచారం చేశారని సీరియస్ అయ్యారు. హుజురాబాద్‌లో దళిత సోదరులపై పెట్టిన అక్రమ కేసులను ఖండిస్తున్నామని.. దళిత బంధు అకౌంట్‌ల ఫ్రీజింగ్ ఎత్తివేసి వారికి డబ్బులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 9 నుంచి జరిగే అసెంబ్లీలో దళితుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని తెలిపారు.

## ప్రభుత్వ ఏర్పాటుకు 'మహా'యుతి సిద్ధం

**మొదటి పేజీ తరువాయి...**

సీఎం రేసులో ముందున్నట్లు వార్తలు వస్తున్నాయి. మహారాష్ట్ర శాసన సభ గడువు మంగళవారంతో పూర్తికానుంది. గెలిచిన కూటమి 72 గంటల్లోగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. లేదంటే రాష్ట్రపతి పాలన విధించే అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వ ఏర్పాటుకు మహాయుతి వేగంగా అడుగులు వేస్తున్నట్లు సమాచారం.

**ముఖ్యమంత్రి పీఠం ఎవరిదంటే?**

మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరో మహాయుతి నేతలు, బీజేపీ నాయకత్వం నిర్ణయిస్తుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ తెలిపారు. మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించారని అన్నారు. మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోల్ కూడా కేవలం 200 ఓట్ల మెజారిటీతో గెలిచినట్లు గుర్తు చేశారు.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి 234 స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్ నేతృత్వంలోని మహావికాస్ అఘాడీ 46 స్థానాలకే పరిమితమైంది. మహారాష్ట్రలో అన్ని వర్గాల ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చారని చంద్రశేఖర్ అన్నారు. మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత హోదా ఇప్పుడు ఏ పార్టీకీ దక్కదని అందుకు కాంగ్రెస్ వైఖరే కారణమని విమర్శించారు. మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత హోదా దక్కాలంటే కనీసం 29 స్థానాలు నెగ్గాలి. విపక్ష పార్టీల్లో ఏ పార్టీకి కూడా ఆ స్థాయిలో సీట్లు రాలేదు.

**ఆయనకు ఉపముఖ్యమంత్రి పదవి?**

మహారాష్ట్రలో మహాయుతి ఘన విజయం సాధించడంతో కూటమిలోని అగ్రనాయకులకు ఏ పదవులు దక్కుతాయనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఏక్‌నాథ్ శిందేకు డిప్యూటీ సీఎం పదవి కట్టబెడతారని వార్తలు వస్తున్నాయి. ఉపముఖ్యమంత్రితో పాటు కీలక శాఖలను ఆయనకే ఇస్తారని తెలుస్తోంది. అయితే ఇందుకు శిందే ఒప్పుకుంటారా? లేదా? అనే దానిపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది.

## చివరి దశకు సమగ్ర కుటుంబ సర్వే

**మొదటి పేజీ తరువాయి...**

పాఠశాలలో ఆహారం, పరిశుభ్రతపై ప్రధానంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, యావత్ క్యాబినెట్ ప్రత్యేక దృష్టికి సాధించిందని అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫుడ్ పాయిజన్, అపరిశుభ్రత వంటి అంశాలకు తావు లేకుండా కార్యాచరణ. ప్రణాళిక రూపొందిం చడానికి సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

## అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణాలు

**మొదటి పేజీ తరువాయి...**

నోటీసులు జారీ చేశారు. నిర్మాణాలు ఆపివేయాలని సూచించారు. ఎక్‌మామిడి రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 345లోని ఫామ్‌హౌస్‌లో నిర్మాణాలకు సంబంధించి డాక్యుమెంట్స్ సబ్మిట్ చేసి పర్మిషన్స్ తీసుకోవాలని ఈ నెల 5న అలీకి నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ఆయన రెస్పాండ్ కాకపోవడంతో మరోసారి పంచాయతీ కార్యదర్శి నోటీసులు ఇచ్చారు. సంబంధిత డాక్యుమెంట్స్ సమర్పించి అనుమతులు పొందాలని సూచించారు. లేని పక్షంలో పంచాయతీరాజ్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారు. వ్యయసాయ క్షేత్రంలో పని చేసే వారికి నోటీసులు అందించామని సెక్రటరీ తెలిపారు. ఈ నోటీసులు అందుకున్న నేపథ్యంలో అలీ కూడా రిప్లై ఇవ్వడానికి రెడీ అవుతున్నట్టు తెలుస్తోంది.

## ఈ రోజు ఎంతో ప్రత్యేకం

**మొదటి పేజీ తరువాయి...**

తీసుకెళ్లారు. అయితే.. నేడు విద్య, రాజకీయాలు, సంస్కృతి, వ్యాపారం ఇలా ఎన్నో రంగాల్లో భారత మూలాలున్న వ్యక్తులు తమదైన ముద్ర వేస్తున్నారు. ఆయా రంగాల్లో నాయకత్వం వహిస్తున్నారు. గయానా అధ్యక్షుడు మహమ్మద్ ఇర్ఫాన్ అలీ కూడా భారత్ సంతతి వ్యక్తే. దేశ వారసత్వం పట్ల గర్వపడేలా చేస్తున్నారు" అని కొనియాడారు. "మరోవైపు, స్లోవేకియాలో కూడా భారత్ సంస్కృతి పరిరక్షణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. మన ఉపనిషత్తులు తొలిసారిగా వారి భాషలోకి అనువాదం జరిగాయి. ఈ ప్రయత్నాలు ప్రపంచవ్యాప్తంగా భారతీయ సంస్కృతి ప్రభావాన్ని ప్రతిబింబిస్తున్నాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. కోట్లాది మంది హృదయాల్లో మన దేశ సంస్కృతి సంప్రదాయాల పట్ల ఉన్న అభిమానం మనందరికీ గర్వకారణం" అని పేర్కొన్నారు.

## అదానీ లంచాల వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చించాలి

**మొదటి పేజీ తరువాయి...**



నేతలు సమావేశానికి హాజరయ్యారు. శీతాకాల సమావేశాలు సోమవారం నవంబర్ 25న ప్రారంభమై డిసెంబర్ 20 వరకు కొనసాగనున్నాయి. వక్ఫ్ సవరణ బిల్లు, మణిపూర్ హింసాకాండపై చర్చకు డిమాండ్ చేసే అవకాశం ఉన్నది. ఇప్పటికే పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీపై అమెరికా ఆరోపణలపై ప్రతిపక్షాలు కేంద్రంపై విరుచుకుపడుతున్నాయి. గౌతమ్ అదానీ కేసుపై పార్లమెంట్ సంయుక్త కమిటీతో విచారణ జరిపించాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. సమావేశానంతరం కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ మాట్లాడుతూ అదానీ లంచాల కుంభకోణంపై సమావేశంలో చర్చకు అనుమతించాలని తమ పార్టీ ప్రభుత్వాన్ని కోరిందన్నారు. వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చించేందుకు ఏర్పాటైన జేపీసీ శీతాకాల సమావేశాల మొదటి వారం చివరిలో తన నివేదికను సమర్పించే అవకాశం ఉన్నది. జేపీసీలో చేరిన విపక్ష ఎంపీలు నివేదిక సమర్పించేందుకు మరింత సమయం కావాలని డిమాండ్ చేస్తున్నారు. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 26న సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో నిర్వహించే కార్యక్రమంపై కూడా సమావేశంలో చర్చించారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం పంజాబ్ కోర్టుల సవరణ బిల్లు, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, కోస్టల్ షిప్పింగ్ బిల్లు, ఇండియన్ పోర్ట్స్ బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నది. సమావేశం అనంతరం కేంద్రమంత్రి కిరణ్ రిజుజు మాట్లాడుతూ సమావేశానికి 30 రాజకీయ పార్టీలకు చెందిన 42 మంది నేతలు హాజరయ్యారన్నారు. కొన్ని అంశాలపై నేతలు చర్చించాలన్నారు. కానీ, లోక్‌సభ, రాజ్యసభలో మంచి చర్చ జరగాలని కోరుకుంటున్నామన్నారు. ఏ అంశంపైనా చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

## రాష్ట్రంలో భారీగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు!

**మొదటి పేజీ తరువాయి...**

ఏర్పడుతుంది. హైదరాబాద్‌లోని మారేడ్‌పల్లిలో అత్యల్పంగా 14.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. పగటి, రాత్రి పూట ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. ముఖ్యంగా రాత్రి సమయంలో ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. తెల్లవారుజామున కనిష్ఠంగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. అందుకే రాత్రి సమయంలో అత్యవసరం అయితేనే బయటకు వెళ్లాలని సూచిస్తున్నారు. తెల్లవారుజామున కూడా జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారుచలి తీవ్రత కారణంగా ఉదయం వాకింగ్ కు వచ్చే వారి సంఖ్య తగ్గుతోంది. చలితో వృద్ధులు, పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. బయటకు వెళ్లే వారు చెవులకు గాలి తగలకుండా చూసుకోవాలని సూచిస్తున్నారు. మందపాటి దస్తులు ధరించాలని వివరిస్తున్నారు. ముఖ్యంగా అస్తమా ఉన్న వారు చలి కాలం జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం తగ్గుతోంది. ఈ వారంలో గతం కనిష్ట విద్యుత్ డిమాండ్ నమోదు అవుతుంది. మరోవైపు లా నినా పరిస్థితులు ఈ సంవత్సరం భారతదేశానికి అనూహ్యంగా కఠినమైన శీతాకాలాన్ని తీసుకురావచ్చని గతంలో హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఎల్ నినోకు వాతావరణ ప్రతిరూపమైన లా నినా, పసిఫిక్ మహాసముద్రం ఉపరితల జలాల శీతలీకరణను కలిగి ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇది చల్లని ఉష్ణోగ్రతలతో పాటు ఎక్కువ వర్షపాతం నమోదు కావడానికి కారణం అవుతుందని వివరించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో చలి తీవ్రత ఎక్కువగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిద్దాం

**మొదటి పేజీ తరువాయి...**

అభివృద్ధి జరుగుతుంది, గ్రామాల్లో ఉన్న ప్రతి పేద వ్యక్తికి కూడా తెలంగాణ సాధించిన ఫలితం అందుతుందని కేసీఆర్ తెలంగాణ ఉద్యమం రోజుల్లోనే చెప్పేవారు. తెలంగాణ ఏర్పడిన తరువాత కేసీఆర్, జగిత్యాల జిల్లాను ఏర్పాటు చేయడంతో పాటు, హైదరాబాద్ తరువాత ఎక్కువ సంఖ్యలో, 4,500 డబుల్ బెడ్ రూం ఇండ్లు జగిత్యాలకే కేటాయించి ప్రత్యేక శ్రద్ధ చూపెట్టారు%-% అని ఎమ్మెల్సీ కవిత తెలిపారు.

**నాయకులు పార్టీ మారినా.. పార్టీతోనే కార్యకర్తలు**

ప్రస్తుతం పార్టీ మారిన ఎమ్మెల్యే సంజయ్, అప్పుడు ఎమ్మెల్యే కాకపోయినా, పార్టీ ప్రతి కార్యక్రమంలో వేదిక పైకి తీసుకొచ్చి, కాబోయే ఎమ్మెల్యే అంటూ ఐదేండ్ల పాటు ప్రతి గ్రామంలో చెప్పామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ఓడిపోయినా వదిలేయకుండా గౌరవంగా చూసుకుంటామనే సందేశం ఇచ్చిన సభ్యత గల పార్టీ బీఆర్ఎస్ అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆనాడు జగిత్యాల ఎమ్మెల్యేగా ఉన్న జీవన్ రెడ్డి ఎన్ని ఆకృత్యాలు, ఆఘాయిత్యాలు చేసినా, బీఆర్ఎస్ కార్యకర్తలంతా ముందుండి కొట్లాడారు కాబట్టే, జగిత్యాలలో గులాబీ జెండా ఎగిరిందని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. నాయకులు పార్టీలు మారినా, కార్యకర్తలు పార్టీలోనే ఉంటారని చెప్పడానికి మంచి ఉదాహరణ జగిత్యాల నియోజకవర్గం అని ఆమె పేర్కొన్నారు.

**పార్టీ మారిన వ్యక్తులను ప్రజలు క్షమించరు**

ఒక పార్టీలో గెలిచి ఇంకో పార్టీకి మారిపోయినప్పుడు ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వెళ్తే అర్థముండేదని, కానీ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయకుండా గోడ మీద పిల్లిలాగ ఉండటం తల్లి పాలు తాగి రొమ్ము గుద్దడం లాంటిదని ఎమ్మెల్సీ కవిత మండిపడ్డారు. అలాంటి వ్యక్తులను ప్రజలు క్షమించరని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేసారు. ఎమ్మెల్యే పదవిని అడ్డు పెట్టుకోవడం పిరికితనమని, అలాంటి నాయకులు బీఆర్ఎస్ కు అవసరం లేదని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేసారు. గులాబీ జెండా అంటేనే గుండె ధైర్యం, గులాబీ జెండా అంటేనే ఉద్యమ పిడికిలి అని ఎమ్మెల్సీ కవిత అన్నారు. పిరికివాళ్ళు, పదవుల వ్యామోహం ఉన్న వాళ్లు బీఆర్ఎస్ పార్టీకి అవసరం లేదన్నారు.

**స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని, పార్టీ నుండి కార్యకర్తలకు, స్థానిక నాయకత్వానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మెల్సీ కవిత భరోసానిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, ఎమ్మెల్యే పార్టీ మారారనే అంశంతో సంబంధం లేకుండా గ్రామ గ్రామాన గులాబీ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన ఏ ఒక్క పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించలేకపోతోందని, వాళ్లు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇంకా ప్రారంభించలేదని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి, వైఫల్యాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు ఎమ్మెల్సీ కవిత.

**సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం**

ప్రతి గ్రామంలో వాట్సాప్ గ్రూప్ లు, సోషల్ మీడియా సిద్ధం చేసుకోవాలని, కేసీఆర్ హయంలో ఎలా ఉంది, ప్రస్తుతం ఎలా ఉంది అనే అంశాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్సీ కవిత సూచించారు. కరెంటు కోతలు, రైతు భరోసా, మహిళలకు నెలకు రూ. 2,500 ఇవ్వకుండా ఎలా మోసం చేసారనే అంశాలను ఇప్పటినుండే చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచనలను తీసుకొని, స్థానిక సంస్థల ఎన్నికల్లో జగిత్యాలలో మెజారిటీ సీట్లు గెలిచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎమ్మెల్సీ కవిత పార్టీ నేతలకు సూచించారు.

కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యా సాగర్ రావు మాట్లాడుతూ నీ కోసం తపించిన బిడ్డ కష్టాల్లో ఉండి, జైల్లో ఉన్నప్పుడు పార్టీ మారిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్,రాజకీయాలకు మచ్చ తెచ్చారు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జెడ్పీ ఛైర్ పర్సన్ దావ వసంత సురేష్ తదితరులు పాల్గొన్నారు

**బీసీ నాయకులతో ఎమ్మెల్సీ కవిత సమావేశం**

బీసీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులతో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. యునైటెడ్ ఫులే ఫ్రంట్, తెలంగాణ జాగృతి, బీసీ కుల సంఘాల ప్రతినిధులతో ఎమ్మెల్సీ కవిత సమావేశమయ్యారు. రేపు ఉదయం 11 గంటలకు కులగణన కమిషన్‌కు ఎమ్మెల్సీ కవిత నివేదిక అందజేస్తారు. ఈ సమావేశంలో జాగృతి ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి, బీసీ నేతలు గట్టు రాంచందర్ రావు, బొల్లా శివ శంకర్ , ఆలకుంట హరి, ఉపేందర్, మఠం భిక్షపతి, రాజారాం యాదవ్, దావ సురేష్ పాల్గొన్నారు.

# తమ స్థలంలో నుంచి వేస్తున్న రోడ్డును ఆపండి



తేజస్విని కాలనీ రోడ్డు వేస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ కె రవికుమార్



రోడ్డు వేస్తున్న ప్రాంతంలో అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ టి. వెంకట్రామి రెడ్డి



తమ స్థలంలో నుంచి వేస్తున్న రోడ్డు ను ఆపాలని కోరుతున్న కొండకళ్ళ శ్రీకాంత్ రెడ్డి, కొండకళ్ళ మనికాంత్ రెడ్డి లు

బుద్వేల్, నవంబరు 24(ప్రభాత ఉదయం): మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు నిర్మిస్తున్న అపార్ట్మెంటుకు మా స్థలంలో నుంచి జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ అధికారులు రోడ్డు వేస్తున్నారని, దాన్ని ఆపాలని అత్తాపూర్ కు చెందిన కొండకళ్ల శ్రీకాంత్రెడ్డి, కొండకళ్ల మనికాంత్ రెడ్డిలు వాపోయారు. తాము విన్నవించుకున్న జీహెచ్ఎంసీ నుం చి రోడ్డు కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్ పోలీసుల సహకారంతో రోడ్డు పనులు చేస్తున్నారన్నారు. ఇండ్లే లేని ఈ ప్రాంతంలో రోడ్డు ఎవరికోసం వేస్తున్నారని ప్రశ్నించారు. కొండకళ్ల శ్రీకాంత్ రెడ్డి, కొండకళ్ల మనికాంతిరెడ్డిలు రోడ్డు వేస్తున్న ప్రాంతానికి చేరుకుని నిరసన చేపట్టారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి.... అత్తాపూర్ తేజస్వినికాలనీలో సర్వేనెంబర్ 94లో 2,490.18 గజాల స్థలం తమ పేరున ఉందన్నారు. దాని పక్కనే హైదరూడ కు చెందిన బం డారు నారాయణ స్థలం ఉందన్నారు. వాటికి ముందు మంత్రి జూపల్లి కృష్ణారావు తనయుడు జూపల్లి వరున్ కు సంబందించిన స్థలాలు ఉన్నాయన్నారు. బండారు కుటుంబ సభ్యులు, జూపల్లి కుటుంబ సభ్యులు కుమ్మకై తమ స్థలాన్ని కాజేయాలని కుట్ర పన్నారన్నారు. తమ స్థలాన్ని గిఫ్ట్ డీడ్ చేసుకుని తమకు డబ్బులు చెల్లించలేదన్నారు. దీనిపై తాము చేసిన గిఫ్ట్ డీడ్ ను క్యాన్సిల్ చేయడానికి రంగారెడ్డి జిల్లా కోర్టులో కేసు వేశామని, అది డిసెంబర్ 9వ తేదీన హియరింగ్ కు ఉందన్నారు. కేసు కోర్టులో ఉండగానే తమ స్థలంలో రోడ్డు వేస్తున్నారని వాపోయారు. అదేమని జీహెచ్ఎంసీ అధికారులను ప్రశ్నిస్తే వారు రోడ్డు వేస్తున్న సలానికి గిఫ్ట్ డీడ్ ఉందని అది రోడ్డు కు ఇవ్వడంతోనే. రోడ్డు వేస్తున్నామని అంటున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సామెల్

## డిసెంబర్ 2న జరగబోయే మండల జనరల్ బాడీని విజయవంతం చెయ్యాలి

### రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు. బి సామెల్

రాజేంద్రనగర్, నవంబరు 24(ప్రభాత ఉదయం) సిపిఎం పార్టీ రాజేంద్రనగర్ మండల కమిటీ సమావేశం జిఎం గట్టయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా రంగారెడ్డి జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు బి సామెల్ హాజరయ్యారు. సందర్భంగా సామెల్ మాట్లాడుతూ... డిసెంబర్ 2న జరగబోయే మండల జనరల్ బాడీని విజయవంతం చెయ్యాలని కోరుతూ సిపిఎం పార్టీ అనేది పేద బలహీన బడుగు వర్గాలతో పాటు ప్రజలందరికీ అండగా ఉంటూ పనిచేస్తుందన్నారు. పార్టీలో పనిచేస్తున్న మండల కమిటీ సభ్యులతో పాటుగా ప్రతి పార్టీ సభ్యులు క్రమశిక్షణగా మెలగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం. అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలని తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని. నిరుద్యోగ యువతను ఆదుకొని ఉద్యోగాలు కల్పించాలని. డిమాండ్ చేశారు సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం చంద్రమోహన్ గారు మండల కార్యదర్శి జిఎం కురుమయ్య. మండల కమిటీ సభ్యులు ఎస్ మోహన్. ఎస్ రామ్మోహన్రావు సిఐటియు మండల కన్వీనర్ జె రుద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



రక్త దానం చేసిన వారికి సర్టిఫికెట్ లు బాహుకరిస్తున్న బజ్ రంగ్ దళ్ నేతలు

## బాబుల్ రెడ్డినగర్‌లో రక్తదానం

బుద్వేల్, నవంబరు24(ప్రభాత ఉదయం): మైలార్దేవుపల్లి డివిజన్ బాబుల్ రెడ్డినగర్ లో ఆదివారం విశ్వహిందు పరిషత్, భజరంగ్ దళ్ ఆర్యనగర్ జిల్లా ఆద్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. వారికి భజరంగ ళ్ నేతలు సర్టిపికెట్లు అందజేశారు. కార్యక్రమంలో భజరంగ్ దళ్ రాష్ట్ర నాయకులు ముఖేశ్ యాదవ్, మహేందర్. రాహుల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం



రాజేంద్రనగర్/బండ్లగూడ/శంషాబాద్/షాపూర్, నవంబర్ 24(ప్రభాత ఉదయం) కిస్మత్పూర్, హిమాయత్ సాగర్ శంషాబాద్ షాపూర్ విద్యుత్ సెక్షన్లలో వివిధ మరమ్మత్రా నిమిత్తం సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని శిక్షణ అసిస్టెంట్ ఇంజనీర్లు తెలిపారు. కిస్మత్పూర్ విద్యుత్తు సెక్షన్ పరిధిలోని స్నేహిత హిల్స్ సబ్స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎక్సైజ్ అకాడమీ, అభ్యుదయ నగర్, సంధ్యా నగర్, ఇందిరమ్మ కాలనీ, ఆదర్శనగర్, మాచన్పల్లి ఎంక్లేవ్, ఆనంద్ ఎంక్లేవ్, వీర బ్రహ్మేంద్ర కాలనీ, ద్వారకా నగర్, భారతి నగర్, యాదవ మిత్ర కాలనీ, డీడీ కాలనీ, సాయిబాబా నగర్, ఖాళీ మందిర్, బ్యాంకాలని, మై చల్ కాలనీ, డాన్ బోస్కో చర్చ్, జి ఆర్ నగర్ పరిధిలలో విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ మల్లేష్ రాజ్ తెలిపారు.

**హిమాయత్ సాగర్ సెక్షన్ లో...**

హిమాయత్ సాగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలోని గంధంగూడ విద్యుత్ సబ్స్టేషన్ పరిధిలో వార్షిక నిర్వహణ నిమిత్తం ఇండస్ వ్యాలీ , సంజయ్ గాంధీ నగర్, భవాని కాలనీ, బైరాగి గూడ, శివ సాయి నగర్, సుబ్రహ్మణ్య కాలనీ, రంగారెడ్డి కాలనీ, దత్తాత్రేయ కాలనీ, వాల్మీకి ఆశ్రమం, శివపురి, సాయి బాలాజీ నగర్, కేకే-1,2, ఫీల్ గుడ్ హోమ్స్, శ్రీనివాస కాలనీ, కేకే-4, తిరుమల హిల్స్ గుట్ట, గంధం గూడ విలేజ్, విగ్నేశ్వర కాలనీ, చంద్రయ్య కాలనీ, కిష్టారెడ్డి స్కూల్, డిస్కవరీ స్కూల్, గంధం గూడ గృహాలు, పావని పటేల్, రఘురాం నగర్ కాలనీ, నర్సారెడ్డి కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, డైమండ్ వ్యాలీ, ప్రశాంత్ నగర్, తిరుమల గార్డెన్, రాధా రియటెర్స్, పావని హార్మోని విల్లాస్, బచ్పన్ స్కూల్, పద్మశ్రీ హిల్స్ ప్రధాన రహదారి, పి అండ్ టీ కాలనీ విద్యుత్ ఫీడర్, స్పెషల్ బ్లాక్ కీర్తి రిచ్మండ్ ప్రాంతాలలో మధ్యాహ్నము రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు స్నేహిత హిల్స్ ఫేస్ -1,2, రాయల్ ఓక్ ఫర్నిచర్, ఇండియన్ పబ్లిక్ స్కూల్, స్టోన్ ఏజ్ అపార్ట్మెంట్స్, బ్రాడ్ వే హోటల్, షాదన్ కాలేజ్, పీరం చెరువు విలేజ్, వాసతి ఆనంది, ఎంపైర్ ఇన్ సిగ్మా విల్లాస్, గిరిదారి అపార్ట్మెంట్స్, ఇలాంటి కాలనీ ఏబిసిడి, స్పెషల్ బ్లాక్స్, కీర్తి రిచ్మండ్, వాంబే కాలనీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు భవన సముదాయం, ఎల్ అండ్ టి లేబర్ క్వార్టర్స్, ఎల్ అండ్ టి కన్స్ట్రక్షన్ ప్రాంతాలలో వివిధ మరమత్రా నిమిత్తం సోమవారం సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ బి అమర్ సింగ్ తెలిపారు

**శంషాబాద్ లో...**

శంషాబాద్ విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడానికి ఎం.ఆర్.ఓ ఆఫీస్, మహావీర్ బిల్డర్స్, శంషాబాద్ మార్కెట్, ఇంచ్ బై ఇంచ్, కాశిష్ ఫంక్షనాల్, సంపత్ నగర్, హుడా రోడ్డు, మున్సిపల్ ఆఫీస్, కే ఎల్ సి సి ఫంక్షన్ హాల్ ప్రాంతాలలో సోమవారం ఉదయం 10 గంటలనుండి 12 గంటల వరకు, 12:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాల అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాషా తెలిపారు.

**షాపూర్ లో...**

రామంజ పూర్ విద్యుత్ పీటర్ పరిధిలో సోమవారం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మల్కారం విద్యుత్ ఫిల్టర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కవేలిగూడ, రామంజపూర్, రామంజపూర్ తాండ, బోటి గూడ, మల్కారం గ్రామం ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ సురేష్ రెడ్డి తెలిపారు విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించాలని ఆయన కోరారు.



మైలార్ దేవుపల్లిలో ఓటరు జాబితాలో పేరు సరిచూసుకోండి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ కె రవికుమార్

## ఓటరు జాబితాలో పేర్లు సరిచూసుకోండి

బుద్వేల్, నవంబరు24(ప్రభాత ఉదయం) : ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ కె.రవి కుమార్ పరిశీలించారు. మైలార్ దేవుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లిన ఆయన ఓటర్లు ఎవరైనా వస్తున్నారా.. అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఓటరు జాబితాలో తమ పేరుందా.. లేదా అని ఓటర్లు చూసుకోవడానికి అవకాశం కల్పించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఓటరు జాబితాలో ఏమైన తప్పులు ఉన్నా, చిరునామ మారినా, వాటిని సరి చేసుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ ఎ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## దావీదు దేవుని శక్తితో గొల్యాతును హతమారుస్తాడు



రెవరెండ్ చిట్టి బాబు

బుద్వేల్, నవంబరు 24(ప్రభాత ఉదయం) : దేవునికి ఇష్టానుసారులు గా జీవిస్తే మన జీవితంలో ఎలాంటి అడ్డంకులు ఎదురైనా వాటిని సులభంగా ఎదుర్కొనవచ్చని మారుటేరు ప్రాంతానికి చెందిన రెవరెండ్ చిట్టిబాబు అన్నారు. రాజేంద్రనగర్ మన్నా ఫుల్ గాస్పెల్ చర్చ్ లో ఆదివారం జరిగిన ఆరాధనలో ఆయన పాల్గొని బైబిల్ సందేశాలను అందజేశారు. గొల్యాతు ను దావీదు ఐదు సన్నని రాళ్ళను ఏరుకొని తన యొద్దనున్న చిక్కములో ఉంచుకొని వడిసెల చేత పట్టుకొని ఆ ఫిలిస్తీని చేరువకు పోయి అతన్ని హతమారు స్తాడన్నారు. ఐదు సన్నని రాళ్లు అనగా సుబుద్ధి(1వ సమూయేలు 18 :5), తెగింపు(1వ సమూయేలు 17:32), తగ్గింపు (2వ సమూయేలు 7 :18), వివేకము(1వ సమూయేలు 18:30), స్తుతించడము(కీర్తనలు 103:1)అని అర్థం అన్నారు. ఇవి ప్రతి ఒక్కరి జీవితంలో ఉండాలని తెలిపారు. ఆరాధనలో మన్నా చర్చ్ పాస్టర్ రెవరెండ్ సిహెచ్ జాన్ మోజెస్, సిస్టర్ సిహెచ్ ప్రభావతి లో పాల్గొన్నారు. ముగింపు ప్రార్థనలు రెవరెండ్ జాన్ మోజెస్ తల్లి సిస్టర్ కృపారత్నం చేశారు. ఈ సందర్భంగా రెవరెండ్ చిట్టిబాబు పలువురికి బైబిల్ లు అందజేశారు.



జిల్లా కరాటే నూతన కార్యవర్గం

## వనపర్తి జిల్లా కరాటే సంఘం సభ్యుల ఏకగ్రీవం

కొత్తకోట, నవంబర్ 24(ప్రభాత ఉదయం)వనపర్తి జిల్లా కరాటే సంఘం సభ్యుల ఏకగ్రీవం ఎన్నుకున్నారు. ఆదివారం వనపర్తి పట్టణంలోని రెయిన్బో స్కూల్లో నిర్వహించిన వనపర్తి జిల్లా కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నుంచి పరిశీలకులుగా శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఈ నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. వీరిలో మన కొత్తకోటకు చెందిన గాడ్స్ ఆన్ వారియర్స్ చోటు ఖాన్ కరాటే డు ఇండియా కి చెందిన మాస్టర్స్ ని అనుకోవడం జరిగింది. వీరిలో ఉపాధ్యక్షులుగా జి పరమేష్ (కనిమెట్ట) వడ్డే శివరాజ్ (మదనాపూర్)జఫర్ సోదిక్ జి హరీష్, యాదవ్ ఆర్గనైజర్ సెక్రెటరీ,జాయింట్ సెక్రెటరీ ఎండి కైసర్,జే సుమ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఇంతటి గొప్పటి అవకాశం రావడానికి మాకు సహకరించి మమ్మల్ని ఈ స్థాయిలో నిలిచిన మమ్మల్ని స్థాయికి తీసుకొచ్చి జిల్లాలో గౌరవాన్ని ఇచ్చి నా మా గురువు అబ్దుల్ నబీ కి ప్రత్యేకత కృతజ్ఞతలు చెప్పారు.

## అత్తాపూర్‌లో శ్రీ అయ్యప్ప స్వామి మహా వడి పూజ



పూజలలో పాల్గొన్న మాజీ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి

బుద్వేల్, నవంబరు 24 (ప్రభాత ఉదయం): అత్తాపూర్ లో వనం మహేందర్ రెడ్డి నివాసంలో ఆదివారం జరిగిన శ్రీ అయ్యప్ప స్వామి మహా పడి పూజ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. స్వామి వారికి పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, వనం లక్ష్మీకాంతరెడ్డి లు పాల్గొన్నారు.



## అందరి బాగోగులు కోరేటోళ్లం

### ఎంపీ డీకే అరుణ

### రెడ్డి జాగృతి వనమహోత్సవంలో ఎంపీ డీకే అరుణ

హైదరాబాద్ (వనస్థలిపురం), నవంబర్ 24: అందరి బాగోగులు కోరేటోళ్లుళు ళ రెడ్డి సామాజిక వర్గం వారు అని ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆదివారం హైదరాబాద్ వనస్థలీపురంలోని అనన్య ఏకో రిసార్ట్స్ లో ఆదివారం రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో వన మహోత్సవ వేడుకలు ముఖ్య అతిథిగా ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు. ఎంపీ డీకే అరుణకు రెడ్డి సామాజికవర్గ పెద్దలు, రెడ్డి జాగృతి నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా టెంపుల్ డీకే అరుణ మాట్లాడుతూ... రెడ్డి సామాజికవర్గం అంటేనే అందరిని కలుపుకు పోయేటోళ్లన్నారు. ఈ సమాజంలో అన్ని వర్గాల వారు బాగుండాలని కోరేవాళ్లు రెడ్లన్నారు.రెడ్డి సామాజిక వర్గాన్నంతా ఇలా వన మహోత్సవంలో కలుసుకోవడం హ్యాపీగా ఉందన్నారు. తామే కాదు అన్ని వర్గాలు బాగుండాలన్న.. మన కుల పెద్దలు నేర్పించిన సంస్కృతి మరవొద్దన్నారు. ఆ దిశగా రెడ్డి సామాజికవర్గం ముందుకు సాగేలా బాటలు వేసిన మన పెద్దలకు రుణపడి ఉండాలన్నారు. మనలో మరింత చైతన్యం రావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదన్నారు.ఎవరు కష్టమని వచ్చినా.. వారందరినీ అక్కున చేర్చుకుని సహాయం చేసే గుణమున్నోళ్లు రెడ్డి కులస్తుల న్నారు. సామాజిక సేవలో రెడ్డి కులస్తులు పాత్ర మరువలేనిదన్నారు.కులమత భేదాలు లేకుండా గ్రామస్థాయి నుంచి విదేశాల వరకు రెడ్డి కులస్తులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. సామాజికవర్గ నేచర్ ను మున్ముందు కొనసాగించేలని, తరతరలాకు కొనసాగించాలని కోరుతున్నానన్నారు. ఇంత మంచి ప్రోగ్రామ్ ఆర్గనైజ్ చేసి, తనను అహ్వానించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు చెప్పారు.

# తెలంగాణ మూవీ, మరియు టీవీ ఆర్టిస్టుల యూనియన్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం

జూబ్లీహిల్స్, నవంబర్ 24(ప్రభాత ఉదయం) టీఎమ్‌టీడీఏయూ (తెలంగాణ మూవీ, టీవీ మరియు డిజిటల్ ఆర్టిస్టుల యూనియన్) ఆధ్వర్యంలో చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మరియు మాగ్నాడ్ ఆసుపత్రి, యూసఫ్‌గూడ మద్దతుతో నవంబర్ 22, 23, 24 తేదీల్లో మూడు రోజుల పాటు మెగా వైద్య శిబిరంను ఘనంగానిర్వహించారు. మొదటి రోజు మొత్తం 142 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య పరీక్షలు, అందించారు. ప్రత్యేక అతిథిగా తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డైరెక్టర్ వీర్ శంకర్ హాజరయ్యారు. తెలంగాణ మూవీ టీవీ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ బాధ్యులను అభినందించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కళాకారులకి క్యారెక్టర్స్ విషయంలో డైరెక్టర్ అసోసియేషన్ తరపున సహకరిస్తామని హామీ ఇచ్చారు. రెండవ రోజు హాజరు అయిన 160 మంది కి , వైద్య పరీక్షలు నిర్వహించారు. లేబర్ కమిషనర్ గౌతమి దాస్ ముఖ్య అతిథిగా హాజరై,తగు సూచనలు అందించారు. గవర్నమెంట్ నుంచి వస్తున్నటువంటి సౌకర్యాలు అన్నిటిని కళాకారులకు అందిస్తామని చెప్పారు అలాగే కళాకారులకు ఈశ్రం కార్డ్స్ విషయంలో కూడా పూర్తిగా సహకరిస్తారని హామీ ఇచ్చారు. ప్రత్యేకించి ఈ వైద్య శిబిరాన్ని చూసి ఇక్కడ జరుగుతున్న వైద్య పరీక్షలను చూసి లేబర్ కమిషనర్ యూనియన్ యూనియన్ బాధ్యులని అభినందించారు.

మూడవ రోజు ఆదివారం కావడంతో 24 క్రాఫ్ట్స్ లో గల ఇతర యూనియన్ సభ్యులు సుమారు 300 మంది కి వైద్య సేవలు అందించారు. తెలంగాణ భాషా , సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మమిడి హరికృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి కళాకారులకు ఎ రకమైన సహకారం కావాలన్నా మ సంస్కృతిక శాఖ తరుపన అందిస్తాము అని చెప్పారు. ఇలాంటి వైద్య సదుపాయని కల్పిస్తూ కళాకారులకి అండదండలు ఉంటున్న తెలంగాణ మూవీ టీవీ అండ్ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ ని ప్రత్యేకంగా అభినందించారు.



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు

తెలంగాణ మూవీ, టీవీ మరియు డిజిటల్ ఆర్టిస్టుల యూనియన్ గౌరవ అధ్యక్షులు పృథ్వీ రాజ్ మెగా హెల్త్ క్యాంపు ని నిర్వహించిన యూనియన్ అధ్యక్షుడు రాజశేఖర్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ వైద్య శిబిరం మేగాస్టార్ చిరంజీవి ప్రేరణతో, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ మాధవి , స్వామి నాయుడు సహకారంతో నిర్వహించారు. అధ్యక్షుడు రాజశేఖర్ పర్యవేక్షించగా, ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు:

జనరల్ సెక్రటరీ: బి. నూకరాజు

వైస్ ప్రెసిడెంట్లు: డి. పద్మ రేఖ, శ్రీనివాస్ రాథోడ్

ఆల్ కమిటీ చైర్మన్: నందూరి రాము, వర్కింగ్ ప్రెసిడెంట్: అష

ట్రెజరర్: ఎస్.ఆర్.ఎస్ ప్రసాద్,ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.పి.రెడ్డి,జాయింట్ సెక్రటరీ,రజిని శ్రీకళ

ఈసీ సభ్యులు,మాధురి, ఎల్. పద్మ, సౌదమిని,ర్యాలీ మోహన్ రావు, , వాలి సత్య ప్రకాష్, కే.,సంజీవరావు, ఆకెళ్ళ గోపాల్,కృష్ణ, కుటుంబ శర్మ ,జూనియర్ శోభన్ బాబు, కందుల శివ,వర్షిత మరియు పిఆర్ఓ గోంగూర శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ మెగా వైద్య శిబిరం అనేక మందికి వైద్య సేవలను అందిచే లా కృషి చేసిన , చిరంజీవి నే సమాజసేవలో మరో ఉదాహరణ అని అన్నారు

ఈ కార్యక్రమం లో మాగ్నాయిడ్ హాస్పిటల్స్ సంపత్ మేనేజింగ్ డైరెక్టర్ సాహస్ కుమార్,డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్, డాక్టర్ అమ్రిష్ రామ్ రెడ్డి జనరల్ సర్జన్ %ఁ% మెడికల్ డైరెక్టర్, డాక్టర్ మహేంద్ర బిరాదార్ పల్మోనాలజీ మెడికల్ సూపరింటెండెంట్, డాక్టర్ పవన్ కుమార్ రెడ్డి .ఎన్ సీనియర్ కన్సల్టెంట్ క్రిటికల్ కేర్ మెడిసిన్, డాక్టర్ వంశీ కృష్ణ ఆర్థోపెడిక్ సర్జన్, డాక్టర్ శ్వేతా దామచెర్ల జనరల్ మెడిసిన్ %ఁ% డయాబెటాలజీ, డాక్టర్ సింధు కొడాలి గైనకాలజిస్ట్, డాక్టర్ చంద్రిక డాక్టర్ నవీన్,.సాయికిరణ్ ఆపరేషన్స్ మేనేజర్ అడ్మినిస్ట్రేషన్ మరియు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



అయ్యప్ప స్వామి పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

## అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ప్రజల సుభిక్షంగా ఉండాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 24(ప్రభాత ఉదయం) ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని పి. వి.ఎన్.నగర్ కాలనీ లో బి. జె .వై. ఎం. నాయకుడు పాక శివ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన అయ్యప్ప పడి పూజ జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కార్తీక మాసంలో అయ్యప్ప మాలధారణ చేసి క్రమశిక్షణ తో మండలం దీక్ష పూర్తి చేసుకుని శబరిమలై అయ్యప్ప దర్శనం చేసుకోవడం నిజమైన అదృష్టమని,మల్కాజిగిరి నుండి కొంత మంది అయ్యప్ప మాల వేసుకుని పాదయాత్రగా శబరిమల కు బయలుదేరారని వారందరు కూడ ఏటువంటి ఆటంకము లేకుండా శబరిమల చేరుకొని ఇరుముడి సమర్పించి క్షేమంగా తిరిగి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, మేకల రాము యాదవ్, బిజెపి నాయకులు రాజేష్ యాదవ్, అజిత్ సాయి తదితరులు ఉన్నారు.

## రాబోయే రోజుల్లో ప్రాంతీయ పార్టీలకి అనుబంధ పార్టీగా కాంగ్రెస్

### తెలంగాణ బీజేపీ నాయకుడు బాల్ రెడ్డి జోస్యం



గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 24(ప్రభాత ఉదయం) భారత దేశ ఆర్థిక రాజధాని నగరం ఉన్న మహారాష్ట్ర లో భారతీయ జనతా పార్టీ కూటమి అఖండ విజయం కార్యకర్తల్లో సంతోషం ఉత్తేజం ఇచ్చాయి అని బీజేపీ నాయకుడు బాల్ రెడ్డి అన్నారు. ఆదివారం గద్వాల జిల్లా బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొక్క బాల్ రెడ్డి మాట్లాడుతూ... 100 పైగా సీట్లు పోటీ చేసిన కాంగ్రెస్ కేవలం 16 సీట్లు సాధించడం,అది కూడా అతి తక్కువ మార్జిన్ తో గట్టెక్కడం ద్వారా ప్రజలు కాంగ్రెస్ పార్టీ యొక్క వినాశకర విధానాలని తిరస్కరించారు అని అన్నారు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,తెలంగాణ కాంగ్రెస్ నాయకులు మహారాష్ట్ర లో ప్రచారం చేసిన ఒక్క నియోజికవర్గం లో కూడా ఆ పార్టీ విజయం సాధించలేదు సరి కదా,డిపాజిట్స్ కూడా పోయాయి అని ఎద్దేవా చేశారు. తెలంగాణ లో తాము సంక్షేమ పథకాలు జనానికి నచ్చాయి అని,వారి ఆమోదం లభించడానికి మహారాష్ట్ర ఎన్నికలు ఉపయోగపడతాయి అని ఇక్కడి నాయకులు అన్నారు అని,వాళ్లంతా ఇపుడు ఇదే మాటకి కట్టుబడి,తెలంగాణ ప్రజలకి తాము మహారాష్ట్ర లో ఏం సాధించారో తెలియజేయాలి అని ఛాలెంజ్ చేస్తున్న అన్నారు సంక్షేమం,అభివృద్ధి,డబల్ ఇంజిన్ సర్కార్,ఎక్ హై తో సేఫ్ హై అనే నినాదాలతో వెళ్లిన భారతీయ జనతా పార్టీ ని ప్రజలు అపూర్వంగా ఆదరించి 133 స్థానాలు ఇచ్చారు అని,ఈ విజయనికి కృషి చేసిన ప్రభారీలకి,కార్యకర్తలకి,నాయకులకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు తెలిపారు మోదీ,అమిత్ షా,అరుణమ్మ,కిషన్ రెడ్డి,బండి సంజయ్ కొండా విశ్వేశ్వర్ రెడ్డిల నాయకుత్వంలో తెలంగాణ లో కూడా ఇవే విధానాలతో ముందుకు వెళ్లి,తెలంగాణ లో బీజేపీ ని అప్రతిహత విజయాన్ని సాధించేలా తామందరం కృషి చేస్తాం అని ప్రకటించారు జారండ్ లో కూడా కాంగ్రెస్ చేసింది ఏం లేదని,ఇంతకుముందు ఉన్న 16 సీట్లు మాత్రమే మిగిలాయి అని చెప్పారు.అక్కడ ఏదో చక్రం తిప్పేద్దాం అని తెలంగాణ ప్రజల సొమ్ముతో ప్రత్యేక విమానాల్లో జారండ్ వెళ్లిన కాంగ్రెస్ నాయకులు నిరాశతో తిరిగి వచ్చారు అని,ఇప్పుడు ప్రజల డబ్బుతో తిరిగిన తిరుగుళ్లకి సమాధానం చెప్పాలి అని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ దేశం లో ఉన్న ప్రాంతీయ పార్టీలకి అనుబంధ సంస్థ గా కొనసాగడం ఖాయం అని ఆయన చెప్పారు



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి

## 30న రైతు సదస్సును విజయవంతం చేయండి

### కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి

కొత్తకోట, నవంబర్ 24(ప్రభాత ఉదయం) ఈనెల 30న మహబూబ్ నగర్ లోజరగనున్న రైతు సదస్సును రైతులంతా తరలివచ్చి విజయవంతం చేయాలి అని కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం పెద్దమందడి మండలంలోని అలవాల, పెద్దమందడి, మణిగిల గ్రామాలలోని కొనుగోలు కేంద్రాల దగ్గరకి వెళ్లి రైతులను కోరారు. వ్యవసాయంలో వచ్చిన ఆధునాతన సాగు పద్ధతులు, మెలకువలను రైతులకు తెలియజేసేలా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుంది. ఈనెల 28 నుండి రైతుల కోసం వివిధ వ్యవసాయ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుంది. ఈనెల 30వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు పాల్గొంటున్నారు. యూనివర్సిటీ అభివృద్ధి చేసిన కొత్త వంగడాలు, ఆయిల్ పంప్ కంపెనీలు నూతన ఆవిష్కరణలు, రైతులకు ఉపయోగపడేందుకు అందుబాటులోకి వచ్చిన వివిధ కంపెనీ వినూత్న ఉత్పత్తులను ఇక్కడ స్టాల్ ఏర్పాటు చేసి ఉంచుతారు. ఆధునాతన పరికరాలు, ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, డ్రోన్లు, వాటిని అన్నిటిని ప్రదర్శనలో ఉంచుతారు. రైతులందరూ 30న జరిగే సభను వచ్చి వెళ్లే విధంగా కాకుండా రైతులకు అవగాహన కల్పించేలా మూడు రోజులపాటు 28వ తేదీ నుండి స్టాళ్లను అందుబాటులో ఉంచి మహబూబ్ నగర్ లో రైతు సదస్సులు నిర్వహించడం జరుగుతుంది. రాష్ట్రంలోని రైతులు దేశంలో వ్యవసాయ సాగు విధానాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకునేలా సదస్సు నిర్వహించడం జరుగుతుంది. ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలోని రైతులందరూ పాల్గొని రైతు అవగాహన సదస్సు విజయవంతం చేయాలని కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో పెద్దమందడి సింగల్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెంటన్న యాదవ్, సింగల్ విండో డైరెక్టర్ నరేష్ కుమార్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, గట్టు మన్యం, రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కురువ నూతన కార్యవర్గం

## కురువల ఐక్యతకు తోడ్పడాలి

### జోగులాంబ గద్వాల జిల్లా కురువ సంఘం అధ్యక్షుడిగా జమ్మిచేడు సతీష్ ఎన్నిక

### మహిళా అధ్యక్షురాలిగా డాక్టర్ నళిని

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 24(ప్రభాత ఉదయం) జోగులాంబ గద్వాల జిల్లా కురువల ఐక్యతకు అందరు తోడ్పాటు అందించాలని జిల్లా కురువ సంఘం నాయకులు అన్నారు.ఆదివారం గద్వాల పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాలో లో ఏర్పాటు చేసిన నూతన కార్యవర్గ ఎన్నికలలో కురువ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా ఎల్లప్ప, అధ్యక్ష,కార్యదర్శులుగా జమ్మిచేడు సతీష్, కొయిల్ దిన్నె తిక్కయ్య,వర్కింగ్ ప్రెసిడెంట్ కరాటే శ్రీహరి, మల్లికార్జున్,మహిళా జిల్లా అధ్యక్షురాలిగా డాక్టర్ నళిని గారు..కురువ సంఘం యుత్ జిల్లా అధ్యక్షుడు క్రాంతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ధరూర్ రవి, ఉపాధ్యక్షులుగా పెదొడ్డి రామకృష్ణ,మనోజ్, చింతలకుంట గోవర్ధన్, కుర్వ పల్లయ్య,తాగూర్ కృష్ణ, కార్యదర్శులుగా బోరుబండి ఈరన్న,సద్దనోంపల్లి లవన్న,మల్దకల్, కొండపల్లి ఈశ్వర్,లోడ దౌలన్న, గార్లపాడు మల్లేష్,కోశాధికారులుగా కేశవులు,మనవపాడు చంద్రన్న,సోషల్ మీడియా ఇంచార్జీలు పెదొడ్డి నర్సింహులు, అయిజ వీరేష్,యుత్ వైస్ ప్రెసిడెంట్లుగా యోగి,పాల్వాయి అయ్యప్ప,మదవు లతో పాటు 70మందితో కూడిన కురువ సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, అయిజ వెంకట్రాములు,చింతలకుంట రాజశేఖర్ కుల సభ్యుల ఆధ్వర్యంలో జిల్లా సంఘం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు...ఈ సందర్భంగా నూతన కార్యవర్గం మాట్లాడుతూ... కురువలు ఐక్యంగా ఉండాలన్నారు. హక్కుల సాధనకు నిరంతరం పోరాటం చేయాలన్నారు. అందరి తోడ్పాడుతోనే కురువల అభ్యున్నతి సాధిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో కురువ ఉద్యోగుల సంఘం సభ్యులు బి.కే.వెంకటేష్, నాగరాజు, రామాంజనేయులు,లక్ష్మీనారాయణ, బుచ్చన్న, కృష్ణ,శ్రీనివాసులు,రామచంద్రుడు మరియు ఆయా గ్రామ,మండల,తాలుకా,జిల్లా సభ్యులు తదితరులు ఉన్నారు...



ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరైన అభ్యర్థులు

## ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 24(ప్రభాత ఉదయం)ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రతిభా ఉపకార వేతనాలు (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) రాత పరీక్ష ఆదివారం జిల్లా కేంద్రంలో ప్రశాంతంగా జరిగింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ పరీక్ష నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. జిల్లా వ్యాప్తంగా 785 మంది విద్యార్థులకు గాను... 771 విద్యార్థులు హాజరయ్యారు. 14 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. గద్వాలలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, బ్రిలియంట్ హై స్కూల్ లలో పరీక్షలు నిర్వహించారు. గుత్త పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షలో అర్హత సాధించిన వారికి 4 సంవత్సరాలు పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున మొత్తం రూ.48 వేలను ఉపకార వేతనాల రూపంలో విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తోందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

## మీసేవా ఫెడరేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 24(ప్రభాత ఉదయం)తెలంగాణ రాష్ట్ర మీసేవ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలభవన్ లో జిల్లాలోని మీ సేవా ఆపరేటర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా తెలంగాణ మీసేవ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బైరాశంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా మీసేవ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తున్నామని ఆయన అన్నారు. అనంతరం మీ సేవ ఫెడరేషన్ జిల్లా నూతన కార్యవర్గాని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా గఫూర్ ను ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జిల్లాలో ఉండే మీ సేవ సెంటర్ నిర్వాహకులకు ఎటు వంటి సమస్యలు వచ్చినా ముందుండి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు, జిల్లాలో మీ సేవా సెంటర్ నిర్వాహకులు, తదితరులు, పాల్గొన్నారు.



మీసేవా ఫెడరేషన్ జిల్లా నూతన కార్యవర్గం

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.